క్లుప్తంగా

ప్రభుత్వ భూములకు హద్దుల ఏర్పాటు

ఐనవోలు : మండల కేంద్రంలోని సర్వేనంబర్ 1150, 1163లో గల 2 ఎకరాల 1 గుంట ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా నివాస గృహాల కోసం 1150 సర్వే నంబర్‌లో ఎకరం 7 గుంటలు, 1163 సర్వే నంబర్‌లో 34 గుంటల భూమిని సేకరించింది. ఈ ప్రభుత్వ భూమి కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులు రాగా బుధవారం రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సర్వే చేసి హద్దులు నిర్ణయించి పెన్సింగ్ వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించుకున్నా, ఏర్పాటు చేసిన బోర్డును తొలగించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెక్కుల పంపిణీ అధికారిక కార్యక్రమం

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి, కన్నారం గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఏ అధికారంతో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారని ఎర్రబెల్లి మాజీ ఉపసర్పంచ్ సతీష్ ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ అధికారిక కార్యక్రమానికి, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం కాదని హితవు పలికారు. గమనించాలని సూచించారు.

అధికారికంగా నిర్వహించాలి

ఐనవోలు : పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జూలై 4న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం మండల ప్రధానకార్యదర్శి నల్లబెల్ల చిన్నరాజు ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రత్యేక సమావేశం

కమలాపూర్ : మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ సంపత్‌రావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి ఎండీ.చోటేమియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక మహాసభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా (రైతుబంధు) పథకంపై సంఘ సభ్యుల సలహాలు, సూచనలు, అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ ప్రత్యేక మహాసభకు జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మారెడ్డి పాల్గొననున్నారని, ఈ ప్రత్యేక మహాసభలో సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


పరామర్శ

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల అభిలాష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బుధవారం ఆస్పత్రికెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

ఐనవోలు : కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగపాటి వెంకటలక్ష్మి ఉదయం కూలీ పనుల కోసం వెళ్తుండగా మార్గమధ్యలో కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె తలతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

ఐనవోలు : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నెపు సంతోశ్(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇల్లంద గ్రామానికి చెందిన రమ్యతో 2016లో వివాహం అయ్యింది. వివాహం అయ్యి 8 సంవత్సరాలైనా పిల్లలు కలగలేదని మదనపడుతుండేవాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంతోశ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి చేరుకుని చూడగా ఉరేసుకుని ఉన్నట్లు గమనించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కాలనీవాసుల హర్షం

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎల్బీఆర్ కాలనీలో 230 ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల అభిప్రాయంతోనే రైతుభరోసా

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌సింగ్
- వివిధ మండలాల్లో మహాజన సభలు
- అభిప్రాయాలు వెల్లడించిన రైతులు



శాయంపేట : మాట్లాడుతున్న డీఏఓ రవీందర్ సింగ్

శాయంపేట : రైతు భరోసా పథకం అమలుకు చేపట్టిన మహాజన సభల్లో రైతుల సలహాలు, సూచనల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం రైతుభరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. సభకు హాజరైన రైతులు పంట సాగు చేస్తున్న రైతులకు, కౌలు రైతులకు, 5ఎకరాల లోపు ఉన్నవారికే రైతు భరోసా పథకం వర్తింపజేయాలని సూచించారు. బ్యాంకు రుణాలు, వాహన రుణం కోసం ఆదాయం పన్ను అందరూ కడుతున్నారని, పన్ను చెల్లింపు పరిధిని కూడా పరిగణలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రవీందర్ సింగ్ మాట్లాడుతూ.. సభకు మహిళా రైతులు ఎక్కువగా హాజరు కావడం అభినందనీయమని, రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. అనంతరం మొదటిసారిగా మండల కేంద్రానికి వచ్చిన అతన్ని, నోడల్ ఆఫీసర్ సోమశేఖర్‌ను పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గంగాజమున, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, శాయంపేట, ఆత్మకూరు, పెంచికలపేట, పెద్దపూర్ సీఈఓలు రాజమోహన్, ఓం ప్రకాష్ రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రకాశ్, మల్లయ్య, జయ్‌పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : పదెకరాల భూమి ఉన్న రైతులకే రైతుభరోసా ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎల్కతుర్తి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక మహాజన సభ సమావేశం సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు రైతులు రైతుభరోసా పథకం అమలుపై అభిప్రాయాలను తెలిపారు. కేవలం వరి పంటకే కాకుండా ఇతర పంటలైన మొక్కజొన్న, పత్తిపంట, మిర్చి పంటలకు సైతం 500ల బోనస్ ప్రకటించాలని పలువురు రైతులు కోరారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని మరికొంత మంది రైతులు అధికారులకు తెలిపారు. రైతుల సూచనలు, సలహాలు, అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి మనోహర్‌రావు, డీఏఓ రవీందర్‌సింగ్ తెలిపారు. ఏఓ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, వైస్ చైర్మన్ శేషగిరి పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : రైతులకు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులపై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తేనే రైతులు బాగుపడుతారని నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు అన్నారు. బుధవారం రైతు భరోసా పథకం రూపకల్పన కోసం రైతు అభిప్రాయ సేకరణను నందనంలో ఎఫ్ఎస్‌సీఎస్ సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు అగ్రికల్చర్ యంత్రాలపై 50 శాతం సబ్సిడీ అందించాలన్నారు. అనంతరం రైతుల నుంచి అభిప్రాయాలు స్వీకరించగా చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే రైతుభరోసా అందించాలని మెజార్టీ రైతులు అభిప్రాయపడినట్లు తెలిపారు. డీసీఓ నాగేశ్వర్‌రావు, ఏఓ అడువ కవిత, డీసీసీబీ ఐనవోలు బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డైరక్టర్లు బుచ్చిరెడ్డి, చిరంజీవి, సంపత్‌రావు, రాంచంద్రయ్య, ఏసోబు, ఎలేంద్ర, సొసైటీ సీఈఓ సంపత్, రైతులు, నాయకులు శ్రీనివాసరావు, రాజశేఖర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి : సమావేశంలో పాల్గొన్న అధికారులు

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ స్వప్న, ప్రజాప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

ఎల్కతుర్తి: ఐదేళ్ల పాలనలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, దానికి ప్రజలు, అధికారుల సహకారం మరువలేనిదని ఎంపీపీ మేకల స్వప్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ నివేదిక చదివి వినిపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సందర్భంగా వ్యవసాయ భూముల్లో భూసారం పెంచేందుకు రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏఓ రాజ్‌కుమార్ తెలిపారు. రైతులకు కావల్సిన ఎరువులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సిజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరం చేసినట్లు వైద్యధికారి తెలిపారు. అలాగే పాము కాటు, తేలు కాటుకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వీటికి సంబంధించిన వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి మాట్లాడారు. ఎండాకాలంలో నీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఏపీఓ అనిత మాట్లాడుతూ.. ఈజీఎస్ పథకంలో కొబ్బరి మొక్కలు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంరతం ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన సందర్భంగా అధికారులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీఓ రవికుమార్, ఏపీఎం రవీందర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు వరం కల్యాణలక్ష్మి


చెక్కులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఎజ్రా

వేలేరు : పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వరంగా నిలుస్తోందని భీమదేవరపల్లి వైస్ ఎంపీపీ మాడుగుల ఎజ్రా అన్నారు. బుధవారం మండలంలోని కన్నారం, ఎర్రబెల్లి గ్రామాల్లో 13 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చెప్యాల బుచ్చమ్మ, విజయలక్ష్మి, కాంగ్రెస్ మండల నాయకులు కొలుగూరి రాజు, గ్రామశాఖ అధ్యక్షుడు వరుణ్, నాయకులు శ్రవణ్‌కుమార్, కిశోర్, రాజేందర్, యాదగిరి, దీలీప్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలి


తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చేయ్యి చూపించిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌లో 1;100శాతం క్వాలిఫై చేయాలని, గ్రూప్ 2, 3 నోటిఫికేషన్‌లో అదనంగా పోస్టులు పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలని, మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని అన్నారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ నెంబర్ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ రాకేశ్‌రెడ్డి, నాయకులు నవీన్, రాజశేఖర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై ప్రమోద్‌కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

శాయంపేట : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రమోద్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఆన్‌లైన్‌లోనైనా, ఫోన్‌లోనైనా గుర్తుతెలియని వ్యక్తులు మాయ మాటలు చెప్పి డబ్బులు పంపాలని, ఓటీపీ చెప్పాలని, లింకు క్లిక్ చేయాలని అడిగితే నిరాకరించాలని సూచించారు. వారు చెప్పినట్లు చేస్తే బ్యాంకు ఖాతాలోని డబ్బులు క్షణాల్లో మాయం అవుతాయని అన్నారు. మొబైల్ ఫోన్ వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురై డబ్బులు పోగొట్టుకున్నట్లయితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలను తెలపాలని, సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ద్వారా మీ బ్యాంకు ఖాతా నుంచి వేరే బ్యాంకు ఖాతాకు డబ్బులు వెళ్లకుండా హోల్డ్ చేయవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఓగా క్రాంతికుమార్




పరకాల : స్థానిక పోలీస్ స్టేషన్ హౌజ్ అధికారిగా క్రాంతికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రవిరాజ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆత్మకూరు సీఐగా పనిచేస్తున్న క్రాంతికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. కొత్త చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించడంతో పాటు నేరాల నియంత్రణ కోసంచర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన క్రాంతికుమార్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

గురుకుల పాఠశాలలో కౌన్సిల్ లీడర్స్ ఎన్నికలు

శాయంపేట : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం కౌన్సిల్ లీడర్స్, స్కూల్ లీడర్స్ ఎంపికకు ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి తెలిపారు. విద్యార్థినులకు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలువురు విద్యార్థినులు ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ పోలింగ్ ఆఫీసర్స్, పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించగా మిగతా విద్యార్థినులు ఓటుహక్కు వినిగియోగించుకున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ఓట్లు వేసి కౌన్సిల్ లీడర్స్, స్కూల్ లీడర్స్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికై న లీడర్స్‌ను ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి, అభినందించారు.

సర్వేనంబర్లు తారుమారు.. పట్టా భూముల ఆక్రమణ


మాట్లాడుతున్న రమేశ్

వేలేరు : మండలంలోని శాలపల్లి గ్రామంలో కొంత మంది మాజీ మావోయిస్టులు, వీఆర్ఓ కలిసి తమ పట్టా భూములను ఆక్రమించారని శాలపల్లి గ్రామానికి చెందిన రైతు కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్లు ఓ చోట ఉన్నాయని, భూములు మరోచోట ఉన్నాయని, సర్వే నంబర్లు తారుమారు చేసి తమకు ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లను సదరు వీఆర్ఓ అంటగట్టాడని ఆరోపించాడు. గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను బినామీ పేర్లతో ఆక్రమించిన సదరు ముఠా.. వీఆర్ఓతో రికార్డులు మార్పించి పద్మశాలీల ఒరిజినల్ పట్టా భూములను ఆక్రమించి, పేద దళితులకు ఇచ్చిన సిలింగ్ భూములను పద్మశాలీలకు అంటగట్టారని ఆరోపించారు. దళితుల భూములను ఆక్రమించిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రెవెన్యూ అధికారులు స్పందించి తారుమారైన సర్వే నంబర్లు, భూములను సరిచేయాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


కమలాపూర్ : మొక్క నాటుతున్న ఎంపీడీఓ గుండె బాబు, తదితరులు


దామెర : మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

కమలాపూర్ : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని, ప్రతిఒక్కరూ విధిగా ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గుండె బాబు పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఆయన మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణాన్ని మానవాళి పరిరక్షిస్తే పర్యావరణం మానవాళిని రక్షిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రతి కార్యదర్శి 5 వేల మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని, నిర్దిష్ట లక్ష్యం మేరకు మొక్కలు నాటని కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత, పీఆర్ ఏఈ మధు, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శి వినీల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మక్క, మల్టీపర్పస్ వర్కర్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ పరిసర ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని అన్నారు. వాతావరణం సమతుల్యత సాధించాలంటే విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మండల వ్యాప్తంగా 50 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, జెడ్పీటీసీ గరిగె కల్పన, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, ఎంపీటీసీలు పోలం కృపాకర్ రెడ్డి, గండు రాము, సంగరబోయిన మౌనిక, గోవిందు సంధ్య, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవులు కాదు.. ప్రజా సేవ ముఖ్యం


పరకాల : ఎంపీపీ స్వర్ణలతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, తదితరులు


దామెర : మండలంలోని ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

పరకాల : పదవులు శాశ్వతం కాదని, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతీ ఒక్క ప్రజాప్రతినిధి పదవీకాలం ముగిసినంత మాత్రన ప్రజాసేవ మరవకూడదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఐదు సంవత్సరాల పదవీకాలం ముగిసిన పరకాల ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ సిలువేరు మొగిలితో పాటు ఎంపీటీసీలకు, కో ఆప్షన్ సభ్యులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ఉన్నత స్థానాల్లో ఉన్న చాలా మంది రాజకీయ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీల నుంచి దశలవారీగా ఎదిగినవారే అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండటంతో పాటు ప్రజలకు ఏలాంటి సమస్య ఎదురైనా న్యాయం చేసేంత వరకు పాలకులతో కొట్లాడే తత్వం కలిగిన వారేనని అన్నారు. పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటికీ ప్రజలకు సేవ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : ప్రజలకు చేసిన సేవతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం ముగిసిన ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీకు శాలువాతో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ నాగారాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ సుమలత, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : ఐదేళ్లు సేవా చేసి పదవీకి మాత్రమే విరమణ పొందామని, ప్రజా సేవకు కాదని ప్రజాప్రతినిధులు అన్నారు. మండల పాలకవర్గం పదవీకాలం ముగియటంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. నూతన మండలంలో తాముచేసిన అభివృద్ధి పనులను వివరించారు. అధికారుల సహకారం మరువలేనిదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా అమలుచేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ కల్పన, వివిధ శాఖల అధికారులు వారిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఎంపీపీ కగితాల శంకర్, జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ జాకర్ అలీ, ఎంపీటీసీలు కృపాకర్ రెడ్డి, గండు రాము, సంగరబోయిన మౌనికకిరణ్, గోవిందు సంధ్య అశోక్, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

వేలేరు : మండలంలోని కన్నారం గ్రామంలో గల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొన్నాల సమ్మయ్య, మొగిళిచర్ల వీరస్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ హెచ్.కోమికి వినతిపత్రం అందించారు. కన్నారం గ్రామంలోని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లోని చెట్లు, తుప్పలు, తొలగించి సాగుకు అనుకూలంగా చేసుకుని కబ్జాలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించి సీలింగ్ భూములకు పట్టాలు, విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్య కల్పించి రైతుభరోసా మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఈ సందర్భంగా కోరారు.

బాపూజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ మెయిన్ రోడ్డులో అక్షర స్కూల్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని కల్వర్టు వరకు పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది బుధవారం చేపట్టారు. ఈమేరకు మురుగునీటి కాలువలను జేసీబీ సహాయంతో శుభ్రం చేశారు. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ వర్షాకాం దృష్ట్యా రోడ్డుపై వరదనీరు ఆగకుండా చర్యలు తీసుకున్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నరేష్, మున్సిపల్ సిబ్బంది కుమార్, జవాన్ వెంకటస్వామి, చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకుడు సందెల విజయ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

ఖిలా వరంగల్: గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల జిల్లా ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

7న డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పాల్గొనాలని కోరారు.